స్ట్రీట్ లైట్లు ప్రారంభం

స్ట్రీట్ లైట్లను ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

ఇందల్వాయి (డిచ్‌పల్లి), మార్చి 30 : డిచ్‌పల్లి మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా స్ట్రీట్ లైట్లు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు సుదర్శన్, గిరి, మాజీ సర్పంచులు రాధాకృష్ణారెడ్డి, బూస సుదర్శన్, దాస్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు తోఫాల పంపిణీ

రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న నాయకుడు గంధపు రాజు

పొతంగల్, మార్చి 30 : రంజాన్ పురస్కరించుకొని మండల కేంద్రంలో సుమారు వంద మంది ముస్లింలకు స్థానిక నాయకుడు గంధపు రాజు తోఫాలు ఆదివారం పంపిణీ చేశారు. పేదలు కూడా రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో తోఫాలు అందజేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పులకంటి సాయిలు, మన్సూర్, గంధపు దత్తు, రసూల్, మహ్మద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

చందూర్, మార్చి 30 : చందూర్ మండలం కేంద్రంలోని బస్టాండ్ వద్ద, మోస్రా మండలంలోని గోపూర్‌లో హనుమాన్ మాలధారుల ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, మాలధారులు పాల్గొన్నారు.

పట్టణంలో కుక్కల స్వైరవిహారం

ఆర్మూర్‌టౌన్, మార్చి30: పట్టణంలోని పలు కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు కాలనీల్లో గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో బయటికి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలనీల్లో గుంపులుగా కుక్కలు

విశ్వావసు నామ సంవత్సరానికి ఘనస్వాగతం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పండితుల పంచాంగ పఠనం
- పలు చోట్ల ఉగాది పచ్చడి పంపిణీ

యాద్గార్‌పూర్‌లో కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 30 : జిల్లావ్యాప్తంగా ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి విశ్వావసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. పండుగ సందర్భంగా ప్రజలు ఇండ్లకు మామిడి తోరణాలు అలంకరించారు. ఇండ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో వేద పండితులు పంచాంగ పఠనం చదివి వినిపించారు. ఏ రాశుల వారికి ఎలాంటి ఫలాలు అందుతాయో తెలియజేశారు. పలు ప్రాంతాల్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో గంగనీళ్ల ఊరేగింపు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శన చేపట్టారు. జిల్లాకేంద్రంలో నవ్యబుక్‌స్టాల్ యజమాని గంగాధర్ బ్రాహ్మణులకు పంచాంగ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు.

రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో జడ కొప్పు అడుతున్న గ్రామస్తులు

రసవత్తంగా కుస్తీ పోటీలు

కోటగిరి, మార్చి 30 : కోటగిరి మండలకేంద్రంతోపాటు యాద్గార్‌పూర్ గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకొని గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర నుంచి మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. కుస్తీపోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రెంజల్ మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలను ఏర్పాటు చేశారు. చివరి కుస్తీలో ధర్మాబాద్ తాలుకా బెల్లూర్ గ్రామానికి విలాస్ అనే మల్లయోధుడు రూ.2వేల నగదును దక్కించుకున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గాండ్ల నాగరాజు తెలిపారు.

బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలను నిర్వహించారు. విజేతకు ఐదు తులాల వెండి కడియాన్ని అందజేశారు.

ఆకట్టుకున్న జడకొప్పులాట..

ధర్పల్లి/ ఇందల్వాయి (డిచ్‌పల్లి), మార్చి 30 : మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద యువకులు జడకొప్పులాట ఆడారు. ఆటను వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లితోపాటు ఇందల్వాయి మండలం గౌరారంలో జడకొప్పులాట ఆడారు. ఉగాదిసందర్భంగా రెంజల్ మండలం దూపల్లి, సాటాపూర్ తదితర గ్రామాల్లో జడకొప్పు వేసి భక్తిని చాటారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో..

ఖలీల్‌వాడి, మార్చి 30 : జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదేశానుసారం ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ మధుసూదన్‌శర్మ పంచాంగ పఠనం చేశారు. వివిధ రాశులకు సంబంధించిన రాశిఫలాలను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, మాజీ నగర మేయర్ దండు నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ చామకూర ప్రభాకర్‌రెడ్డి, చామకూర విశాలినిరెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతి రావు, లక్ష్మీనారాయణ భరద్వాజ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సీనియర్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, శంకర్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు.. తప్పని ఇబ్బందులు

- పునాదులకే పరిమితమైన పాఠశాల భవనం
- లింగాపూర్ గ్రామ పంచాయతీలో విద్యార్థులకు విద్యాబోధన

కోటగిరి, మార్చి 30 : కోటగిరి మండలం లింగాపూర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతులు ఉన్నాయి. ఈ పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.15లక్షలు నిధులు మంజూరు చేసింది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవన నిర్మాణం చేపట్టాలని ఉన్న భవనాన్ని కూల్చారు. కొత్తగా భవనం నిర్మాణం చేపడతామని పనులు మొదలు పెట్టారు. కానీ ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో రెండేండ్ల నుంచి పాఠశాల భవన నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు అవేదన వ్యక్తంచేస్తున్నారు. పాఠశాల భవనాన్ని కూల్చిన నాటి నుంచి విద్యార్థులకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. దీంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా బాలికల మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు, తాగునీటి సౌకర్యానికి రూ.లక్ష మంజూరు కాగా పాఠశాల భవనం లేక.. వచ్చిన నిధులు వెనక్కిపోయాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పునాదుల వద్దే ఉన్న లింగాపూర్ పాఠశాల భవనం

కూల్చివేతకు ముందు లింగాపూర్ పాఠశాల భవనం

జీపీ భవనంలో కొనసాగుతున్న విద్యాబోధన

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

కంఠేశ్వర్, మార్చి 30 : జిల్లాప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి తీవ్రతలోనూ రంజాన్ మాసంలో ముస్లిములు నియమ నిష్ఠలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాల్లో నిమగ్నమైన ముస్లిములు, అదే స్ఫూర్తితో ఈద్-ఉల్-ఫితర్‌ను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

నగరంలో నేడు ట్రాఫిక్ డైవర్షన్

వినాయక్‌నగర్, మార్చి 30 : రంజాన్ సందర్భంగా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు బస్టాండ్ నుంచి జడ్పీ నుంచి బైపాస్ రోడ్డు, అర్సపల్లి రైల్వే గేటు మీదుగా వెళ్లాల్సి ఉంటుందని, బోధన్ నుంచి నిజామాబాద్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా కొత్త కలెక్టరేట్ బైపాస్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని, వాహనదారులు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వినాయక్‌నగర్, మార్చి 30 : నిజామాబాద్ మండల పరిధిలోని బోర్గాం(పీ) గ్రామ శివారులోని ఓ చెట్టు కింద పేకాడుతున్నారన్న సమాచారం మేరకు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.44,720 నగదు, నాలుగు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

సులేమాన్‌నగర్‌లో ఇఫ్తార్

సులేమాన్‌నగర్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఏసీపీ శ్రీనివాస్, సిబ్బంది

రుద్రూర్, మార్చి 30 : రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న పాల్గొని, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని మత పెద్దలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సీసీరోడ్డు పనులనుప్రారంభిస్తున్న నాయకులు

మోర్తాడ్, మార్చి30: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, రవి, క్రాంతి, శ్రీకాంత్, శ్రీనివాస్, లింగారెడ్డి, మహేందర్, శ్రీధర్, సృజన్, మల్లేష్, ధరమ్మ, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శము న్నూరు కాపు సంఘం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన ఆదర్శ మున్నూరుకాపు సంఘం సభ్యులు

మోర్తాడ్, మార్చి30: మోర్తాడ్ మండల కేంద్రంలో ఆదర్శమున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాకిడి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా బొందిలా చంద్రశేఖర్, కోశాధికారిగా నూగురు విజయ్, కార్యదర్శిగా మాసుల అశోక్, ఉపకార్యదర్శిగా నూగూరు వినయ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

నిరుపయోగంగా చెత్త డబ్బాలు

మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న డబ్బాలు

ఆర్మూర్‌టౌన్, మార్చి30: పట్టణంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేయాల్సిన స్వచ్ఛ సర్వేక్షణ్ డబ్బాలు మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. కాలనీల్లో తడి చెత్త, పొడి చెత్త వేసేందుకు డబ్బాలు లేకపోవడంతో కాలనీవాసులు రోడ్ల పక్కకు, డ్రైనేజీల్లో చెత్తను పారవేస్తున్నారు. రోడ్లపై చెత్తను వేయడంతో డ్రైనేజీల్లో ఇరుక్కుపోయి నీరు నిలిచిపోతున్నది. కాలనీల్లో దుర్వాసన వ్యాపిస్తున్నది. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్యాలయంలో ఉన్న స్వచ్ఛ సర్వేక్షణ్ డబ్బాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ముప్కాల్, మార్చి 30: మండల కేంద్రంలోని శుక్రవారి గుడికి కట్ట రాజేందర్ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం రూ.11,111 అందజేశారు. ఆలయ నిర్మణం కోసం దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచు విజయ్, కంచు గంగాధర్, దాత కుంటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

ఆర్మూర్‌టౌన్, మార్చి30: జిల్లా ముస్లింలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగ ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే భీమ్‌గల్ పర్యటన

మోర్తాడ్, మార్చి30: మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి భీమ్‌గల్ మండలంలో నిర్వహించనున్న రంజాన్ వేడుకల్లో సోమవారం పాల్గొననున్నారు. ఉదయం 9గంటలకు భీమ్‌గల్‌లో, 9.30 గంటలకు బాబాపూర్ గ్రామంలో ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తారు. అనంతరం జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎం.ఏ మొయీజ్ నివాసంలో రంజాన్ వేడుకల్లో పాల్గొంటారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

వేల్పూర్, మార్చి 30: మందకృష్ణ మాదిగ పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. వేల్పూర్ మండలంలోని మోతె గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాదిగ కుల సంఘ భవనం నుంచి అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రాం విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రమోద్ మాదిగ హాజరై మాట్లాడారు. మాదిగ అమరుల త్యాగం, మందకృష్ణ మాదిగ పోరాటం ద్వారా వర్గీకరణ చట్టాన్ని సాధించామని అన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

బోధన్, మార్చి 30: పట్టణంలోని వేంకటేశ్వరనగర్‌లోని లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పూదోట రవికిరణ్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ మే 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పుష్కర వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

అదృశ్యమైన మహిళ మృతి

రుద్రూర్, మార్చి 30 : రుద్రూర్ మండలంలోని లింగంపల్లి శివారులో ఆదివారం లక్ష్మీబాయి(62) మృతదేహం లభ్యమైంది. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన దెగావత్ లక్ష్మీబాయి కుమారుడు నాలుగేండ్ల క్రితం మృతిచెందాడు. అప్పటినుంచి ఆమె మతిస్థిమితం సరిగ్గా లేక బాధపడుతుండేది. ఈ నెల 26న రాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. రుద్రూర్ మండలం లింగంపల్లి శివారులోని పొలం వద్ద మహిళ మృతదేహం ఉన్నదని సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు.. అక్కడికి చేరుకొని ఆ మృతదేహం లక్ష్మీబాయిదిగా గుర్తించారు. మానసికస్థితి సరిగా లేకపోవడంతోనే మృతిచెందిందని, మృతురాలి భర్త లింబ్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు రుద్రూర్ ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోధన్ రూరల్, మార్చి 30: బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ శరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు త్వరపడి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లాభసాటి ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాశంకర్, గణపతిరెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు ఉన్నారు.

కల్దుర్కిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ శరత్

నీలాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విండో చైర్మన్

మోస్రాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబు

మద్దతు ధర పొందాలి

రెంజల్, మార్చి 30: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని నీలా విండో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్ కోరారు. ఆదివారం మండలంలోని నీలా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఇమ్రాన్‌బేగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లయక్ అలీఖాన్, గంగాకృష్ణ, బలరాం, రైతు నాయకులు రాఘవేందర్, యోగేశ్, బాబన్న, సుభాష్, నిసార్‌బేగ్, సీఈవో రాందాస్, రైతులు పాల్గొన్నారు.

మోస్రా మండలంలో..

మోస్రా (చందూర్), మార్చి 30 : మోస్రా మండలకేంద్రంతోపాటు గోపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబు.. సొసైటీ చైర్మన్లతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ఏ - గ్రేడ్ రకానికి రూ.2,320, బీ - గ్రేడ్ రకానికి రూ.2,300 ధర అందజేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు జగన్ మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మణ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిర్వహణ మరిచారు.. నిరుపయోగంగా వదిలేశారు..

శక్కర్‌నగర్, మార్చి 30: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని క్రీడా మైదానంలో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన మినీ స్టేడియం భవనం ఏండ్లు గడిచినా వినియోగంలోకి రాలేవడం లేదు. గతంలో ఈ భవనాన్ని ఇండోర్ క్రీడల కోసం గృహనిర్మాణ శాఖ వారిచే నిర్మించారు. ఈ భవనం పూర్తయ్యే సమయానికి గృహ నిర్మాణశాఖ వారికి బాధ్యతలు తప్పించడంతో, వారు పంచాయతీ రాజ్ అధికారులకు అప్పగించారు. చిన్నపాటి పనులు మిగిలిపోయి భవనం నాటి నుంచి నేటి వరకూ అలాగే ఉండిపోయింది. పంచాయతీ రాజ్ శాఖ వారు మున్సిపల్ అధికారులకు అప్పగించామని చెబుతున్నా, అధికారికంగా తమకు అప్పగించకపోయినా, ఈ భవనాన్ని గతంలోనే నిజామాబాద్ స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించారని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. ఏండ్లు గడిచినా, అధికారులు మారినా ఈ భవనం మాత్రం వినియోగంలోకి రావడం లేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని కొందరు తమతమ అవసరాలకు వాడుకుంటున్నారు. తలుపులు విరగగొట్టడంతో పాటు, గదుల్లో గుట్కాలు తిని ఉమ్మివేయగా, లోపల ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తాయి. అధికారులు స్పందించి చిన్నపాటి మరమ్మతులు చేయించి ఈ భవనాన్ని వినియోగానికి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లో నిర్మించిన మినీ స్టేడియం భవనం

రంజాన్‌కు ఈద్గా వద్ద ఏర్పాట్లు

బోధన్‌లోని సాలూరా రహదారి పక్కన ఈద్గా వద్ద మొరం పనులు చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, సిబ్బంది

శక్కర్‌నగర్, మార్చి 30: బోధన్ పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్య పనులు చేయించి మొరం వేయించి గుంతలు పూడ్పి వేయించారు. రెండు రోజులుగా ఈద్గా వద్ద ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ చేయిస్తున్నారు. నీటి సరఫరా కోసం అదనంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

మోర్తాడ్ పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

మోర్తాడ్, మార్చి 30: మోర్తాడ్ గ్రామ పద్మశాలీసంఘం నూతన కార్యవర్గాన్ని ఉగాది సందర్భంగా ఆదివారం ఎన్నుకున్నారు. మోర్తాడ్ పద్మశాలి కల్యాణ మండపంలో ముందుగా ఉగాదిని పురస్కరించుకుని యజ్ఞం నిర్వహించి, పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన పృథ్వీరాజ్‌ను సంఘసభ్యులు సన్మానించారు.

మోర్తాడ్ గంగపుత్ర సంఘం ఎన్నిక

మోర్తాడ్‌లో ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మగ్గిడి శంకర్, ఉపాధ్యక్షుడిగా సుదర్శన్, కోశాధికారిగా సత్యనారాయణ ఎన్నికయ్యారు.

పిచ్చిమొక్కలతో నిండిన క్రీడా ప్రాంగణం

- అధికారుల నిర్వహణ కరువు..
- కంచె లేక తిరుగుతున్న పశువులు

క్రీడా ప్రాంగణం ముఖద్వారం

ఆర్మూర్‌టౌన్, మార్చి30: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించి దేశానికి మంచి క్రీడాకారులను అందించాలనే సదుద్దేశంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడా ప్రాంగణాల నిర్వహణ కరువైంది. దీంతో ఆర్మూర్‌లోని తెలంగాణ క్రీడా ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోయి ఎందుకూ పనికి రాకుండా పోతున్నది. చుట్టూ కంచె లేకపోవడంతో పశువులు అందులోకి చేరి మేస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి క్రీడా ప్రాంగణానికి కంచె ఏర్పాటు చేయాలని యువకులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కల మధ్య ఆట వస్తువులు